జ్యోతిష్పథం

# విజయానికి దారి



– డా॥ ఈ.వి.కె.శివానంద్

మీమీద మీరు ఇంకా ఎక్కువ ఆధిపత్యం నిలుపుకోడానికి మీకు సహాయపడే వ్యాసంగాల మీద ఇష్టం ఏర్పరుచుకోండి. అన్నీ కష్టాలే వచ్చినప్పటికీ మీ మంచి నిర్ణయాలను అమలుపరచడం వాస్తవమైన విజయం. దేన్నీ మీ నిర్ణయాన్ని భంగపరచనివ్వకండి. “ఈ రోజు పోనియ్యి. రేపు మళ్ళీ ప్రయత్నిస్తాను”, అంటారు చాలా మంది. మిమ్మల్ని మీరు మోసగించుకోకండి. ఈ రకమైన ఆలోచన విజయాన్ని చేకూర్చదు. మీరొక తీర్మానం చేసుకున్నప్పుడు, దాన్ని నెరవేర్చడానికి ప్రయత్నం మాననప్పుడు మాత్రమే మీరు విజేతలవుతారు. ఎన్నడూ లొంగిపోని వాళ్ళే విజయం సాధిస్తారు. – **సెయింట్ తెరిసా ఆఫ్ అవిల**

మీకున్న సదాలోచనలూ, దురాలోచనలూ మీ వెంటే వుంటాయి గుర్తుంచుకోండి. కాబట్టి మీ ముఖ్యమైన కర్తవ్యం ఏమిటంటే మిమ్మల్ని మీరు గమనిస్తూ వుండడం, చక్కదిద్దుకొంటూ ఉండటం. మీరు చెయ్యగలిగినంత చక్కగా ఏ పనైనా చెయ్యటం. సరైనది చెయ్యడానికి మీరు చిత్తశుద్ధితో శ్రమిస్తున్నంత కాలం, మీకు వ్యతిరేకంగా ఎవరేమి అన్నా, చేసినా పట్టించుకోకండి. చాలా మంది మిమ్మల్ని నిరుత్సాహపరచి, మీ పనిని నీరుగార్చడానికి ప్రయత్నిస్తారు. అంతే కాకుండా అందరితోనూ మంచిగా వున్నా సరే – పొగడ్తలతోని, తెగడ్తలతోని మిమ్మల్ని వేధిస్తారు. మీ నేర్పరితనంతో మీ మనస్సులో అభిప్రాయాలు ఏర్పరచుకోకుండా, జాగ్రత్తగా, బయటపడకుండా మీ పని చక్కదిద్దుకొంటూ ఉండడమే మీ ప్రతిభను సూచిస్తుంది. అన్ని సందర్భాలలో దేముడు, ప్రకృతి, అనుకూలించవు. ఇది కూడా గుర్తుంచుకోండి. ఎందుకంటే మీ పూర్వ కర్మ లేక తమస్సు అడ్డుపడతాయి.

ఆగర్భ శత్రువునైనా, నేను క్షమిస్తాను అనేది మంచిదే. క్షమా గుణం అన్ని వేళలా పని చేస్తుంది అని అనుకోకండి. అలాగని క్షమించక పోతే గొడవలు ఇంకా పెరుగుతాయి. ఇక్కడ మీ నేర్పరితనం ఏమిటంటే అందరికీ కనబడేటట్టు,

క్షమిస్తున్నట్టు కనబడాలి. ఎంతమంది చుట్టుపక్కల వుంటే అంత మంచిది. టైం కోసం వెయిట్ చెయ్యండి. అప్పుడిక (ప్రైవేటుగా) మీరు కొట్టే దెబ్బ, అవతలి వాడిని కుమిలి కుమిలి ఏడ్చేటట్టు, ఎవ్వడికీ చెప్పుకోలేనట్టు వుండాలి. అయినాసరే మీ తప్పేమీ లేనట్టు వుండాలి. అయినా ఇంకా అతడు మర్యాదగా ఉండటానికి నిరాకరిస్తే కొంతకాలం మీరు దూరంగా ఉండిపొండి. ఇందులో అవమానం ఏమీ లేదు. అవతలి వాడి తదుపరి దాడికి మీరు సిద్ధంగా ఎప్పుడూ వుండాలి. లేకపోతే మీరే ఓడిపోయినట్టు. మహాభారతం మనకి మంచి ఉదాహరణ. ఇలా చేస్తే ఎప్పుడూ జయం మీ వెంటే.

మనం చాలా తొందరగా ప్రాపంచిక విధులలో చిక్కుకుపోతాం. మన ఆధ్యాత్మిక బాధ్యతలు విస్మరిస్తాం. మన శరీరం కోసం, కుటుంబం కోసం శ్రమిస్తాం. ఆత్మ అయితే కొన్ని రోజులపాటు గుర్తే రాదు. పోనీ మన విధులైనా సక్రమంగా చేస్తామా అంటే అదీ లేదు. ఏదో కాలం వెళ్ళబుచ్చుతాం. కొంత మందైతే జీవితమంతా ఇలాగే వుంటారు. కానీ వారికి జీవితంలో అన్నీ కావాలి. దేముడికి, అవతలి వాడికి లంచమిచ్చైనా వీరి పని సాధించుకోడానికి వెనుకాడరు. వీరికి ఆనందం దూరమై అవతలివాడు ఆనందంగా ఉండటం కూడా సహించలేరు. సరైన విధంగా అవతలి వారిని పొగడడం కూడా రాదు వీరికి. పైగా వైరం పెంచుకుంటారు. చావు కూడా వీరిని సంతృప్తిపరచదు. కుటుంబ కలహాలన్నీ ఇలాంటివే. పైగా వీరి ద్వారా వీరి పిల్లలకి కూడా వారసత్వంగా ఈ వైరం పంచుతారు. వీరిని ఎవరు రక్షిస్తారు. అందుకే దివ్యజ్ఞానం అవసరం.



## జన్మదిన శుభాకాంక్షలు


**శ్రీ పైండా రామమోహనరావు** (పిఠాపురం)గారు 7.9.2020న 85వ జన్మదినం జరుపుకున్నారు. భగవంతుడు వారికి ఆయురారోగ్య, ఐశ్వర్యాలనిచ్చి ఆశీర్వదించాలని 'దీపిక' కోరుకుంటున్నది. ఈ సందర్భంగా దివ్యజ్ఞాన దీపిక ఉన్నతిని కాంక్షిస్తూ వారు పంపిన విరాళం. **రూ. 1,000.00.**

# బ్రహ్మవిద్య ప్రాథమిక సూత్రాలు

**జీవోపాధుల పరిణామము**

(1959వ సం॥ ప్రచురణ) రచయిత : **సి.జినరజదాస**

**(గత సంచిక తరువాయి)** స్వేచ్ఛానువాదం : **తోపల్లె కృష్ణబ్రహ్మ శాస్త్రి**




వెనుకటి స్థితినే ఆధారముగ జేసికొని భావిస్థితి పెంపొందుచుండును; ఉత్తమ సంతతి నుత్పత్తి చేయుట కొఱకవసరమైనచో ఆయుర్దాయము పొడిగించు కొనునట్లు అవి ఏర్పాటు చేయబడినవి. గతించినజాతి పరిణామముకన్న రాబోవు జాతిపరిణామము హెచ్చుగానుండును. బేక్టీరియా, ఆల్గె, ఫంగై మొదలగు ఏకకణ ప్రాణుల నుండి నాచువంటి మొక్కలు పుట్టును. ఇవి క్రొత్తవిధమున తమ సంతతిని వ్యాప్తము చేయును; తరువాత స్థితిలో విత్తనములద్వారా సంతతి అభివృద్ధియగును. తదుపరి పుష్పములే, విత్తనములుగా నుపయోగపడును. దీనివలన ఎక్కువశక్తి వ్యయము చేయనవసరము లేకుండ తన ప్రాణము నిల్పుకొనుచు ఉత్పత్తి సాగించును. ఇట్లు క్రమ క్రమాభివృద్ధి చెంది ప్రాణి అంగనిర్మాణములో 'క్లిష్టత' ఏర్పడు చుండును. ఇట్టి 'క్లిష్టత' వలన జీవి ఎక్కువ సంతృప్తికరమైన జీవితము గడుపుటకు సహాయకారిగనుండి తక్కువ శక్తిని వ్యయ పఱిచి తనకంటెబలమైన, శక్తి సమన్విత మైన, పటిష్ఠమైన, సంతతి నుత్పత్తి చేయుచు తన ఆయుర్దాయమును పెంపొందించు కోగలుగును.

జీవకణములో తిరిగి ఇదే ప్రకారము పరిణామ విధానము పని చేయగా జంతువర్గముద్భవించినది. ఏకకణ ప్రాణుల నుండి, వెన్నెముక లేని ప్రాణులు క్రమశః బయల్వెడలినవి.




ఏకకణ ప్రాణులనుండి ధాతునాడీ ప్రసారణ మండలములు గల బహుళకణ ప్రాణులు వృద్ధి చెందుసరికి క్రమేణా వర్గము తరువాత వర్గములో క్లిష్టత ఎక్కువగుట మొదలు పెట్టెను. తదుపరి మధ్య నాడీమండలములకు 'ఒర'వలె వెన్నెముక ఏర్పడెను. అప్పుడు వెన్నెముక జాతికి చెందిన జంతువులు పుట్టుట ప్రారంభమైనది.

# జంతు వర్గము




ప్రత్యేక భాగానికి చెందిన జాతుల సంఖ్యయొక్క
స్థూలమైన అంచనా.
టి. డబ్ల్యు. గాలవేస్ యొక్క "ప్రాథమిక జంతుశాస్త్రము"
అనుగ్రంథము నుండి సేకరించబడినది.

వీనిలో, ప్రాకెడు జంతువుల ఆధారమున పాలిచ్చు జంతువులుద్భవించినవి. పాలిచ్చు జాతికి చెందిన ఉత్తమజంతువులలో ఉచ్చస్థితికి చెంది మంచి అంగ సౌష్ఠవముకలవాడు మానవుడు.

జంతువర్గము నందు సహితము స్వయం పోషక శక్తి, ఉత్పత్తిశక్తి, సహజముగనున్నవి. అంగనిర్మాణము క్లిష్టమైన కొద్ది మాఱిపోవుచున్న పరిస్థితులను తట్టుకొను అర్హతగలిగి తక్కువ ప్రయాసతో తనవలె ప్రాణులను సృష్టించు శక్తి ఆ జంతువునకుండును. వెన్నెముక జంతువులలో, ఉన్నతమగు తరగతికి చెందిన వానిలో నొక వినూత్న చైతన్యము గోచరించును.

"పరిణామ విధానములో క్రింది తరగతికి చెందిన కృతకములు, తమను తమజాతిని పోషించుకొనుటలో తమ యావచ్ఛక్తి వినియోగించి పాటుపడును. జాతి అభివృద్ధి చెందిన కొలది పోషణ విధానము సులభమగుచుండును; తగు మాత్రము ఆహారము తిని దానివలన లభించు శక్తితో తనను, తన సంతతినికూడ పోషించుకొనగలుగును; ఇంక కొంతశక్తి అనుపయోగముగా కూడ మిగులు చుండును. ఉత్తమవిధ జంతువులలో అట్లు మిగిలిపోయిన శక్తి ఎక్కువగుచుండును.

అందువలన ఆహారాన్వేషణకు ఎక్కువ కాలము వినియోగింపకుండ, విరామ సమయమధికము చేసికొనుచుండును. విరామ సమయములందు, మిగులు శక్తిని తమకు ఆనందము నిచ్చు ఆటపాటలలో, వ్యయపఱుచును. ఈ సామాన్య సత్యమును ఉత్తమశ్రేణి జంతువులలోను, మానవులలోను కూడ, మనము గుర్తింపవలసి యున్నది. మానవుడు ప్రగతి చెందిన కొలది శ్రమపడు కాలమును తగ్గించు కొనుచు, విరామమున కెక్కువకాలము మిగుల్చుకొనుటకు ప్రయత్నించును. ఆ విరామకాలము ఆటలయందు, ఆనందము నిచ్చు విజ్ఞానమందు, కళల యందు, ప్రయాణములందు, గడుపును"

(హెర్బర్టు స్పెన్సరు వ్రాసిన లైపీయ గ్రంథము నుండి సేకరించినది).

స్టాంజా 12

# 5వ జాతి-దాని దివ్యబోధకులు

**శ్రీమతి యం.రాజసరస్వతి, గుంటూరు**
సెల్ : 9490541800

47) లెమూరియా, అట్లాంటియను జాతులు రెండూ నిశ్శేషంగా నశించినా, 5వ జాతి పూర్వీకులతోపాటుగా, అనేక మంది అట్లాంటియను గ్రూపులు కూడా ప్రళయం నుంచి రక్షింపబడినాయి.

48) మన 5వ జాతి పూర్వీకులు మొదటి దివ్యమానవ సామ్రాజ్యాలు.

49) బైబిల్ కథలరూపంలోని లక్షణాలు, గ్రుడ్డిగా నమ్మబడుతున్నవి అన్నీ ఈ జాతిలో కన్పిస్తాయి.

మానవ బోధకుల నాగరికత నేర్పిన వారి లక్షణాలు వీరిలో ప్రతి బింబిస్తాయి.

– ం –

47వ శ్లోకములో – ప్రళయం నుంచి రక్షింప బడిన వారిలో, పసుపు, గోధుమ, నలుపు ఎరుపు వర్ణములవారు వున్నారు.

చంద్రుని రంగువున్న వారు నశించారు. మిగిలిన పవిత్రజీవుల నుంచి 5వ జాతి ఏర్పడింది. వారే మొదటి తరం వారిగా, రాజులై పాలించారు.

49వ శ్లోకములో – "సర్పాలు" మరలదిగివచ్చి 5వ జాతిలో శాంతినెలకొనటంలో సహాయం చేశారు. వీరు కూడా బోధకులు అయినారు.

5వ జాతి చరిత్ర ఇంకా పూర్తి కాలేదు. గతించిన సాంప్రదాయ ముద్రలుగా ఇంకా జీవిస్తూ వున్నారు. 5వ జాతి ఉపజాతికి మూలముగా కొన్ని వేల సంవత్సరాలు పసుపు, గోధుమ, నలుపు, ఎరుపు రంగులలో కొనసాగు తున్నారు. మూడవ జాతిలోనే ప్రళయ కాలంలో చంద్రవర్ణము వారు నశించారు.

అప్పటి వారిని "గ్రేట్ డ్రాగన్స్" అంటారు. వారికి సర్పవిజ్ఞాన సంతతి అంటే చాలా గౌరవము. ఈ సర్ప జాతులు త్రికోణాకారపు పిరమిడులలో ప్రపంచానికి నాల్గు మూలల్లో నివశించారు. అవే మనం చెప్పుకునే పిరమిడ్లు దీక్షాపరులు, జ్ఞానవంతులు

(3, 4, 5 జాతుల్లోని వారు) పిరమిడుల క్రింద వున్నారు. పిరమిడులు ఏ భూ భాగపు సొత్తూ కాదు. ఉత్తర, దక్షిణ అమెరికాలు, ఈజిప్టుకు చెందినవని అంటారు. యూరోపియన్ ప్రాంత మంతా జామెట్రికల్ కొలతలతో కట్టిన ''నియోలెతిక్'' గుహలున్నాయి. అట్లాంటిస్ మునిగిన తర్వాత కూడా కొన్ని ద్వీపాలలో వీరున్నారు. ఆర్యజాతి వచ్చేవరకు వున్నారు.

జ్ఞానజీవులు (సర్పాలు) వారి రికార్డులను దాచి వుంచారు. అందు వల్లనే మానవ పరిణామము స్వర్గం నుంచే ట్రేస్ చెయ్యబడింది. మానవులు, నక్షత్రజీవులకూ మేధస్సు ఒకే రకంగా వున్నది. కొందరు మానవులు గతించిన జాతులతో పోలికలు కల్గివున్నారు.

Dragon Constallation గత కాలాల్లో ధ్రువప్రాంతాలతో సంబంధము కల్గి పవిత్రంగా వుండేది. Stellar temples లో అన్ని నక్షత్ర సముదాయా లలో, డ్రాగన్ సముదాయమే ఎక్కువ ప్రభావము చూపేది. మానవ ఘటనలన్నీ దీనికి సంబంధించి వుండేది. 5వ జాతి ఉపజాతులకు అనేక ప్రళయాలలో సంబంధం వున్నది. ఆస్ట్రనామికల్, కాస్మికల్, భౌమిక ప్రళయాలు చాలా జరిగినాయి. అట్లాంటిస్ ప్రళయం ఒక కథమాత్రమే అని ప్రతి అక్కల్ట్ విద్యార్థికి తెలుసు Smith ప్రళయాల గురించి బాగా విపులంగా తన Assyrian tablets లో చర్చించాడు. సూర్య గమనం లోని 12 రాశులలో 10 జంతు సంబంధమైనవిగా, 11వది నీటి సంబంధమని వివరించాడు. పిరమిడ్లు మకరరాశికి చెందినవని వీటికి సంబంధించిన వారే "Dragon of Wisdom" అని, వీరు 3, 4 జాతుల దీక్షాపరులని వివరించారు. నైలునది వరదలకు అట్లాంటియన్ మునకకు సంబంధం వున్నది. ఆస్ట్రనామికల్ రికార్డులలో 4వ మూల జాతి గురించి వున్నది. అప్పటి కాలంలో ధృవాలు 3 సార్లు తలక్రిందులయినవి.

48వ శ్లోకములో దివ్యజీవులు దిగివచ్చి 5వ జాతి ప్రళయము తర్వాత మానవులకు మార్గదర్శకులయ్యారని వున్నది.

పదార్థవాదుల వ్యాఖ్యానాలు అంత మవాల్సిందే. చర్చి దేవాలయాల మూఢ నమ్మకాలు కొంత సత్యాన్ని మరుగు పరుస్తున్నాయి. **(సశేషం)**

# ఓం నమో భగవతే వాసుదేవాయ

– **సేకరణ : బండారు భాగ్యలక్ష్మి,** నర్సాపురం

సెల్ : 9963893525

**శ్రీభగవానువాచ :-**

**అసంశయం మహాబాహో**
**మనోదుర్నిగ్రహంచలమ్**
**అభ్యాసేన తు కౌన్తేయ**
**వైరాగ్యేణ చగృహ్యతే**
(అ.6, శ్లో.35)

**తాత్పర్యము :** గొప్ప బాహువులు గల ఓ అర్జునా! మనస్సును నిగ్రహించుట కష్టమే. మరియు అది చంచలమైనదే ఇట ఏలాంటి సంశయమున్ను లేదు. అయినను అభ్యాసము చేతను వైరాగ్యము చేతను అది నిగ్రహింపబడగలదు.

**వ్యాఖ్య :** మనస్సు చంచలమైనది, దానిని నిగ్రహించుట కష్టసాధ్యమైనది (ప్రయాసతో కూడినపని) అను విషయము శ్రీకృష్ణభగవానుడున్ను ఆమోదించెను. కాని అంతమాత్రము చేత భయపడవలసిన పనిలేదనియు ధైర్యము చెప్పెను. ఏనుగు చాలా గొప్పదే అయిన నేమి ? ఒక చిన్న అంకుశమును సంపాదించిన చాలును దాని ఆట కట్టినట్లే అగును. ఎద్దు బలిష్టమైనది అయినను ముక్కుత్రాటికి లొంగుచున్నది కదా; మనస్సును జయించుట కష్ట సాధ్యమే కానీ అసాధ్యముకాదు, తగు ప్రయత్నముచే అది తప్పక నిగ్రహింప బడగలదు.

ఇక దానిని నిగ్రహించుటకు భగవానుడు భోదించిన ఉపాయములను గూర్చి విచారించెదము. ఈ ఘట్టము సాధకలోకమునకు అతిముఖ్యమైనది ఏలయనినా దానికి వశీభూతులై జనులు అనాది కాలము నుండి ఈ సంసార సాగరమున బడిదరిగానక ఈదులాడు చున్నారో, ఈ జనన మరణాది దుఃఖము లకు లోనగుచున్నారో, ఏది ఆత్మాను భూతికి ప్రధానమగు అడ్డుగోడగా నిలిచి యున్నదో అట్టి మనస్సు యొక్క నిగ్రహమును గూర్చి యిట తెలియ పర్చుడమైనది. సాక్షాత్ అవతారమూర్తి యగు శ్రీకృష్ణభగవానుని ముఖార విందము నుండి అది అత్యంత ప్రాధాన్యము పొందుచున్నది. మనస్సును నిగ్రహించుట ఎట్లు ? అను ఈ ప్రశ్న దాదాపు ప్రతివానికి కలుగు సందేహమే. దీనిని గూర్చి భగవానుడు ఏమి బోధించెనో తెలిసికొనుట అత్యావశ్యకము.

అభ్యాసము, వైరాగ్యము అను రెండు ఉపాయములచే మనస్సును తప్పక నిగ్రహింపవచ్చును అని భగవానుడు హామీ ఇచ్చెను. వైరాగ్య మనగా దృశ్య విషయములందలి దోషములను విచారించి వానియెడల ఏహ్యాభావము కలిగియుండుట. దానిచే మనస్సు బహిర్ముఖముగ పరుగెత్తక అంతర్ముఖముగ మరలును వైరాగ్యము ఎందులకు కలిగిఉండవలెననగా ఈ దృశ్య ప్రపంచములోని సమస్త పదార్థములును కాలక్రమమున నశించు నవియై యున్నవి. తుదకు శరీరమున్ను కొంతకాలమునకు నశించియే తీరును. అశాశ్వతములగు నిట్టి పదార్థములపై వాంఛయేల ? (శాశ్వత వస్తువు ఒక్క ఆత్మయే (దైవమే) కావున దానియెడల మాత్రము కోరిక కలిగియుండవలెను.) ఒకవేళ ప్రాపంచిక భోగములను అనుభవించినను తృప్తి కలుగదు. ఆశ తగ్గదు మరల వాని యందు ద్విగుణీకృత వాంఛ ఉదయిస్తూనే వుంటుంది. వాని వలన వాసనలు బలపడి సంసార బంధము వృద్ధియగును. మనస్సు విషయానుభవమునకై, బహిర్ముఖమగు చున్నకొలది ఆత్మవస్తువు దూరమగు చుండును. ధ్యానమందు మనస్సు నిలవకుండును. కాబట్టి మనస్సు నిశ్చల మగుటకై స్వాధీనపడుటకై విషయ వైరాగ్యము అత్యవసరమైయున్నది. ఇక మనోనిగ్రహమందు గమనించవలసిన రెండవ యంశము అభ్యాసము. అభ్యాసముచే, సతతప్రయత్నముచే ఏకార్యమైనను సాధింపబడగలదు. సోమరులకు మనస్సు లొంగదు ఏలయనగా దానిని లొంగదీయుటకు వారు ప్రయత్నమే చేయరు. ప్రయత్నము గాని, అభ్యాసముగాని లేనిచో లౌకిక రంగమునగాని, పరమార్ధరంగమున గాని ఏ కార్యమున్ను సాధింపబడదు. ఒక చిన్న పరీక్షయందు ఉత్తీర్ణులు కావలెననిన ఎన్ని రోజులో కష్టపడవలసి యుండ, ఇక ఎన్ని జన్మల నుండియో గడ్డకట్టియున్న కఠినమగు మనస్సును కరిగించుట కెంతశ్రమ, ఎంత అభ్యాసము గావింపవలసియుండునో యోచించుకొనవలెను. కాబట్టి ప్రతి రోజున్ను మనస్సును విచార వైరాగ్యము లచే బాహ్యమునుండి మరలించి అంతరంగమున ఆత్మధ్యానమందు నియోగించుటయును అభ్యాసమును బహుబంగుల (ఏ పనిలోనున్నను) గావించినచో అచిరకాలములో మనస్సు స్వాధీనపడి ఆత్మయందే నిరంతరము ప్రీతిని బొందు చుండును.

**శ్రీభగవానువాచ :-**

**పార్థనైవేహ నాముత్ర**
**వినాశస్తస్యవిద్యతే**
**న హి కల్యాణ కృత్క**
**శ్చిద్దుర్గతిం తాతగచ్ఛతి.**
(అ.6, శ్లో.40)

**తాత్పర్యము :** ఓ అర్జునా! అట్టి యోగభ్రష్టునకి ఈలోకమందుగాని, పరలోకమందుగాని వినాశము కలుగనే కలుగదు. నాయనా! మంచికార్యములు చేయువాడెవడును దుర్గతిని పొందదు గదా!

**వ్యాఖ్య :** సత్కార్యతత్పరులకు భగవానుడు అభయ మొసంగుచున్నాడు. యోగాభ్యాసము, ధ్యానము మున్నగునవి చేయువారు ఒకవేళ తమ లక్ష్యమును పొందక పూర్వమే మరణించినచో వారికి దుర్గతి ఏమాత్రమున్ను కలుగదని సాధకులకు భగవానుడు హామీనిచ్చెను. మంచి కార్యములు చేయువానికి ఎన్నడును వినాశముగాని, దుర్గతిగాని కలుగనే కలుగదని భగవానుడు చెప్పుచూ ఉన్నాడు. భగవానుని ఈ వాక్యము భక్తులకు సాధకులకు బ్రహ్మమార్గము జనువారికి సంజీవి వంటిది. చెడ్డపనికి భయపడవలసినదే కాని మంచి పని ఎంత చిన్నదైనను భయపడవలసిన పని లేదని స్పష్టమగుచున్నది. వారు వారు చేయు సత్కార్యముల ననుసరించి జనులకు లభించు సత్ఫలితములలో ఒకింత తారతమ్యము ఉండవచ్చునే కాని, దుష్ఫలితములు మాత్రము ఎన్నడును అట్టివారికి కలుగనేరవు. మరియు శ్రీకృష్ణపరమాత్మ యొసంగిన ఈ ప్రత్యుత్తరమందు పాపాత్ములకు, దుష్కార్యపరులకు, అశుభాచరణ యుక్తులకు దుర్గతి తప్పక కలుగగలదని ధ్వనించుచున్నది.

పాపులకు ఈ లోక మందును, పరలోకమందునుగూడ, వినాశము తప్పక కలుగగలదని స్పష్ట మగుచున్నది (వినాశమనగా నీచ జన్మ, దుఃఖము మొదలైనవి కలుగుట). లక్ష్యము అగు ఆత్మసాక్షాత్కారమును ఈ జన్మయందే పొంది వైచుటకు యత్నించుచు ఒకవేళ పొందజాలక పోయినను భగవద్వాక్యముల వలన ధైర్యమును జేకూర్చుకుని ముందునకు సాగిపోవలెను.

**డిసెంబరు 1- జి. అరండేల్ జయంతి**
**డిసెంబరు 15- యన్. శ్రీరామ్ జయంతి**
**డిసెంబరు 16-సి.జినరాజదాస జయంతి**
**డిసెంబరు 26-జె.యస్.కోట్స్ వర్ధంతి**

**అధ్యాయం-4**

# విధులు (FUNCTIONS)

రచయిత : **ఎ.ఇ.పావెల్**

స్వేచ్ఛానువాదం : **డా॥ పి.ఎల్.ఎన్.ప్రసాద్,**

ఫోన్ నెం. : 9866565863

ఆత్మ మానసికశరీరం ద్వారానే తనని తాను అభివ్యక్తం చేసుకుంటూ ఒక మేధాశక్తి రూపంగా అవతరిస్తుంది. మనం అవగాహనకు అందుతున్న ఆత్మ యొక్క ప్రతిఫలన రూపమే ఈ మనస్సు. మానసికశరీరం ద్వారా అభివ్యక్తం అయ్యే ఆత్మ ఈ మనస్సు. అత్యధిక సంఖ్యాకులు మానవుడిని అతడి మనస్సుని వేరుచేసి చూడలేరు. ఈ కారణంగా వారికి ఆత్మ మనస్సు ఒకటి అనిపిస్తుంది. ఇది అత్యంత సహజము, అనివార్యము. ప్రస్తుతం మానవాళి యొక్క పరిణామంలో మానవుడు 5వ మూల జాతిలో వున్నాడు. అతడి కార్యకలాపాలు అన్నీ ఈ మానసికశరీరం ద్వారానే జరుగు తున్నాయి.

గతంలో భౌతికశరీరం మాత్రమే ప్రజాశక్తి యొక్క ఒక వాహనంగా చైతన్యం పొందింది. కొద్దిమంది మాత్రమే కామశరీరాన్ని పాక్షికంగా చైతన్య పరిచారు. ప్రస్తుతం మానవాళి మానసిక శరీరాన్ని చైతన్యపరచడంలో నిమగ్నమై వుంది. కామశరీరం యొక్క అభివృద్ధి దాని విధివిధానాలు కామాన్ని లేదా ఉద్రేకాలను అభివ్యక్తం చేయడం అన్నవి 4వ మూలజాతి యొక్క ప్రత్యేకమైన కార్యకలాపాలు ఇవే 5వ మూలజాతి యొక్క 4వ ఉపజాతి విధివిధానాలు. పైన వివరించి నట్లుగా 5వ జాతియొక్క లక్షణం 5వ మూలజాతికి దాని 6వ ఉపజాతికి కూడా వర్తిస్తుంది. వీరు ప్రధానంగా మనస్సుని అభివృద్ధి పరచు కోవాలి. అన్నింటినీ అత్యంత వివేకంతో సర్వవిధమైన వ్యత్యాసాలను చూడగలిగే మేధాశక్తిని పొందాలి.

వర్తమాన దశలో అత్యధిక సంఖ్యాకులు తమ స్వీయ దృక్పథంలోనే ఈ వ్యత్యాసాలను చూస్తున్నారు. అంతే గానీ వాటిని సంపూర్ణంగా అవగాహన చేసుకుని నిష్ప్రయోజనమైన వాటిని వ్యతిరేకించటం లేదు. ఈ మానసిక విభాగం సంపూర్ణంగా అభివృద్ధి చెంది నప్పుడు వ్యత్యాసాలన్నింటినీ ప్రశాంతగా గుర్తించి వాటిని సంపూర్ణంగా అవగాహన చేసుకుని ఏది ఉత్తమమైనదో గ్రహించగలుగుతారు. దీనిని మరింత

విస్తృత పరిధిలో చెప్పుకోవాలంటే మన వర్తమానదశలోని 5వ ఉపజాతి యొక్క అభివృద్ధిలో ఇతరుల యొక్క బలహీనత లను స్వప్రయోజనాలకి వాడుకోవడం కనిపిస్తుంది. మరికొందరిని పాదాల క్రింద తొక్కిపెట్టి పీడించడం కనిపిస్తుంది. వారికి సహాయం చేయకుండా వారినే మెట్టుగా చేసుకుని పైకి ఎదగడానికి ప్రయత్నిస్తుంటారు. ఇది చాలా బాధాకర మైన విషయమే అయినప్పటికీ ఈ విధమైన మానసిక అభివృద్ధి కూడా అవసరమే. నిజమైన విమర్శనాత్మక దృక్పథం సవ్యమైన అభివృద్ధి సాధించ టానికి ఇది కూడా ఉపయోగపడుతుంది.

6వ మూలజాతి అదేవిధంగా 5వ మూలజాతి యొక్క 6వ ఉపజాతి ప్రధానంగా ఆధ్యాత్మికత, విధివిధానాల రూపకల్పన, కరుణ సేవచేయడానికి ఉత్సాహం ఉండవలసిన ప్రధాన లక్షణాలు.

ప్రస్తుతం మానవజాతి యొక్క మానసిక అభివృద్ధి ఉద్వేగాల గురించి ఇంకా ఎక్కువగా చెప్పుకోవలసిన అవసరం లేదు. ప్రస్తుత దశ లేక 4వ చక్రం కోరికని ఉద్వేగానికి అభివృద్ధి పరచడానికి నిర్దేశించబడింది. 5వ చక్రం అందించిన ప్రేరణతో ఈ చక్రంలో మేధాశక్తి నిర్దేశించిన రీతిలోనే అభివృద్ధి సాధించింది. ఇదే సమయంలో ప్రస్తుత మానవుడి మేధాశక్తి అత్యంత అద్భుతంగా వికసించింది. 6వ చక్రంలో సామాన్య మానవుడు ఇదే స్థితిలో సాధించబోయే అభివృద్ధికన్నా ఇది చాలా ఎక్కువ.

అగ్ని తుషార సంభవులు శుక్రగ్రహం నుండి 3వ మూలజాతి కాలంలో దిగివచ్చి మానవాళి పరిణామం కోసం సహాయం చేసి బాధ్యతని స్వీకరించారు. వీరి నాయకుడికి భారతీయ గ్రంథాలలో సనత్కుమారుడు అని పేరు. ఆయనతోపాటు ముగ్గురు అధిపతులు 35మంది సిద్ధ పురుషులు సహాయకులుగా వచ్చారు. వీరితో పాటు 100 మంది సాధారణ మానవులు కూడా శుక్రగ్రహం నుండి దిగివచ్చి భూమిపై వున్న సామాన్య మానవులతో కలిసిపోయారు. వీరిని గురించి ప్రస్తావిస్తూ మేధాశక్తి ఏమాత్రం లేనివారిలో మేధాశక్తిని వికసింప చేయడం కోసమే వీరు దిగివచ్చారని చెప్పింది. వీరి కార్యకలాపాలు అన్నీ ఇంచుమించుగా అయస్కాంత రీతిలో ప్రేరేపణ కలిగించాయి. మానవాళి అంతా వారిచే ప్రభావితమై వారి చుట్టుతా పరిభ్ర మించింది. ఆ విధంగా మానవాళిలో అంతర్గతమైన తార ప్రభవించడంచేత వారిలో మహోన్నత వ్యక్తిత్వం వికసించింది.

ఈ విశ్లేషణ నుంచి మన అధ్యయనం

లోకి తిరిగిరావాలి. ఒక విశ్లేషణ అధ్యయనం కోసం మానవుడిని అతడి శరీరాలని వేరుచేసి చూసినా ఆత్మ మాత్రం ఒక్కటే. ఎన్ని చిన్న స్వరూపాలలో తత్వాలలో అవతరించినప్పటికీ ఆత్మ మాత్రం ఒక్కటే అని ఎప్పుడూ మనం జ్ఞాపకం వుంచుకోవాలి. ప్రజ్ఞాశక్తి ఒక ప్రత్యేక కేంద్రం. దీనిని రెండుగా చూడ వచ్చు.

1. మనం అధ్యయనం కోసం ఏర్పాటు చేసుకున్న విభాగం.

2. మన ఇంద్రియాలచేత పరిమితం కాబడిన మన అవగాహనా శక్తి ద్వారా ఏర్పడిన భ్రాంతులు. దీనిద్వారానే ప్రజ్ఞాశక్తి క్రిందిలోకాల్లో పనిచేస్తుంది.

ఆత్మ 3 విభాగాల్లో పనిచేస్తుంది. అది ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులు. వీటి నుండే అసంఖ్యాకమైన ఆలోచనలు కోరికలు కార్యకలాపాలు కొనసాగుతాయి. అయినప్పటికీ ఆత్మకి ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులు 3 వున్నాయి. ప్రస్తుతం ఆ మూడు విధుల్ని విభజించి చూద్దాం. మానవుడికి ఒక విషయం గురించిన జ్ఞానం ఉన్నప్పటికీ అతడి ఇచ్ఛాశక్తితో ఎన్నో కార్యకలాపాలు చేపడతాడు. అతడు ఎన్నో పనులు చేస్తున్నప్పటికీ అతడిలో జ్ఞానం ఇచ్ఛాశక్తి రెండూ వుంటాయి. అదేవిధంగా అతడు ఇచ్ఛాశక్తితో ముందుకు కదులుతున్నప్పుడు జ్ఞానంతో ఎన్నో కార్యకలాపాలు నిర్వహిస్తాడు. ఒక సమయంలో ఈ మూడింటిలో ఒక విధి ప్రధానపాత్ర వహిస్తుంది. కొన్ని సందర్భాలలో మిగతా రెండింటిని ఆక్రమిస్తుంది. అత్యంత తీవ్రంగా ఒక విషయాన్ని తెలుసుకోవాలని జ్ఞానదృష్టితో పూనుకున్న (ఈ మూడింటి కన్నా భిన్నమైన స్థితిలా కనిపిస్తుంది) అప్పుడు కూడా అంతర్గతంగా ఇచ్ఛా చైతన్యశక్తులు పనిచేస్తూనే వుంటాయి. దీనిని అత్యంత శ్రద్ధతో పరిశీలించాలి. దీనిని ఒక ఉదాహరణ ద్వారా అవగాహన చేసుకుందాం. ఆత్మ నిశ్చలస్థితిలో వున్నప్పుడు అది పరిపూర్ణ జ్ఞానస్థితిగా ఆవిష్కరిస్తుంది. ఏ విషయానికి సంబంధించిన వివరాలను అయినా స్వీకరించడానికి సిద్ధంగా వుంటుంది. (దీని గురించి రాబోయే అధ్యాయాలలో వివరించడం జరిగింది)

ఆత్మా ఏకాగ్రస్థితిలో వున్నప్పుడు ఇచ్ఛాశక్తి ఆవిర్భవిస్తుంది. ఆత్మ ఏదో ఒక నిర్ధారితమైన విషయం మీద దృష్టి సారిస్తే, దానితో సాన్నిహిత్యం కలిగి దానికి క్రీయా శక్తితో కూడిన చైతన్యాన్ని కలిగిస్తుంది. ఈ విధంగా ఈ 3 శక్తులు కూడా ఆత్మకి సంబంధించిన వేరువేరు రూపాలు కావు. మూడు రూపాలు అతికించబడి ఒక రూపంగా తయారుకాలేదు. ఒకే తత్త్వం

మూడు రూపాలుగా అవతరించింది.

ప్రాశ్చ యోగశాస్త్ర దృష్టిలో వ్యక్తి రూపం దాల్చిన ఈ ప్రజ్ఞాశక్తియే ఈ మనస్సు అని వివరించడం జరిగింది.

1. భిన్న విషయాలు వస్తువులకి గురించిన ఎరుక. ఇదే మానసిక లోకంలో అత్యంత ప్రధానమైన మేధాశక్తి విభాగం.

2. కోరిక స్వరూపం, కొన్ని విషయాలను పొందాలనే కోరిక ఇది కామలోకంలో ప్రధానంగా కనిపిస్తుంది.

3. అనేకమైన లక్ష్యాలను, వస్తువులను సాధించడానికి చేసే తీవ్రమైన కృషి కార్యకలాపాలు ఇదే క్రియాశక్తి. ఇది భూలోకంలో ప్రధానంగా కనిపిస్తుంది. బుద్ధిలోకంలో సంపూర్ణముగా ఒక విషయాన్ని గుర్తించి అవగాహన చేసుకునే స్థితి ఏర్పడుతుంది. కారణమే నిలుస్తుంది. ఈ మూడు విభాగాలుగా అన్నివేళలా ప్రతి విషయంలోనూ పనిచేస్తూనే వుంటాయి. కానీ ఒక సమయంలో ఒకటి మిగతా రెండింటికన్నా ప్రధానపాత్ర వహిస్తుంది.

మనస్సుని మరింత నిశితంగా విశ్లేషించి తెలుసుకుందాం. ఆత్మయొక్క మరో విధియే భావాతీతమైన ఆలోచనా క్రమం. ఈ విధి ఊర్ధ్వ మానసికశరీరం లేదా కారణ శరీరం ద్వారా నిర్వహించ బడుతుంది. ఇంతకు పూర్వం చెప్పు కున్నట్లుగా స్పష్టమైన ఆలోచనా క్రమాన్ని ఆత్మ అధో మానసికశరీరం ద్వారా చేపడుతుంది. స్పష్టమైన ఆలోచనా క్రమాన్ని మనం ఇప్పుడు సమగ్రంగా పరిశీలిద్దాం.

మానసిక శరీరం నుండి స్మృతులు, జ్ఞాపకాలు, ఊహలు ప్రారంభం అవుతాయి. స్మృతి యొక్క విత్తనం తమస్సులో దాగివుంది. ఇది ద్రవ్యరాశి యొక్క తత్త్వం. కొంత చైతన్యంతో ఒకసారి స్పందనలు ప్రారంభం అయిన తర్వాత అవి ప్రసరిస్తూనే వుంటాయి.

ఆ విధంగా మానసిక శరీరం జీవాత్మ లేదా ఆలోచన కర్త యొక్క ఒక వాహనం. నిజానికి ఈ మానవుడు కారణశరీరంలోనే నివసిస్తూ ఉంటాడు. కానీ అతని మానసిక శరీరం ప్రజాశక్తి యొక్క వాహనంగా అధో మానసికలోకంలో పనిచేయడం కోసం ఉద్దేశించబడింది. ఇది కామ భౌతిక శరీరాల ద్వారా కూడా వ్యక్తం అవుతూనే వుంటుంది. సాధారణంగా మెలకువగా వున్నా ప్రజ్ఞాస్థితిలో దీనినే మనసు అంటారు.

ఈ క్రమాన్ని సవివరంగా ఇలా చెప్పుకోవచ్చు. స్పష్టమైన ఆలోచనా క్రమం మానసిక శరీర ద్రవ్యరాశిలో స్పందనలు కలిగిస్తుంది. ఈ స్పందనలు క్రింది స్థాయిలోని ఆలోచనా కర్త యొక్క మందమైన కామశరీరంలోకి ప్రవేశిస్తాయి.

ఇది తిరిగి భౌతికమైన మెదడులోని ఈథెరిక్ అణువులను ప్రభావితం చేస్తుంది. అది తిరిగి మందమైన బూడిద వర్ణంలో వున్న భౌతికశరీరంలోకి ప్రసరించి కార్యకలాపాలుగా మారుతుంది. ఆ విధంగా ఒక ఆలోచన కార్యరూపం ధరించడానికి ఈ విధివిధానం అంతా భౌతికమైన మెదడులో జరగాలి. దీనికి అనుగుణమైన నాడి వ్యవస్థ అంతా కామశరీరంతో అనుసంధానమై వుంటుంది. మేరు మస్తిష్క వ్యవస్థ అంతా ప్రభావితమై మానసిక శరీరం ద్వారా పనిచేస్తుంది.

ఈ పనిచేసే క్రమాన్ని అంతటినీ మరికొంత వివరంగా తెలుసుకుందాం. భౌతిక మెదడులోని ప్రతి చిన్నకణానికి కామశరీరంలోనూ, మానసికశరీరంలోనూ వాటి ప్రతిరూపాలు వుంటాయి. అదే విధంగా మన అవగాహన కోసం భౌతిక మెదడు అంతటినీ భిన్న అణువులతో పొరలు పొరలుగా కలిగిన కూడికగా భావిద్దాం. దీనికి అనుగుణంగా అదే విధంగా పొరలు కూడిక కామ మానసిక ద్రవ్యరాశుల్లో కూడా ఏర్పడతాయి. భౌతికం పైన కామం, కామంపైన మానసికం వుంటాయి.

ఆ విధంగా భిన్నసాంద్రతలు కలిగిన ద్రవ్యరాశుల్లో మూడుపొరలు ఏర్పడ్డాయి. ఇవి ప్రతి ఒకటి మరోదానికి ప్రతిరూపమే అయినప్పటికీ, ఏ ఒక్కటీ మరొక దానితో కలిసి వుండదు. కానీ భౌతిక కామపొరల మధ్య ఒక అనుసంధానం వుంటుంది. అదేవిధంగా కామ మానసిక అణువుల మధ్య కూడా బాంధవ్యం వుంటుంది. సాధారణ మానవుడి మెదడులో జరిగే సమస్త కార్యకలాపాల స్థితిగతులను ఇది సూచిస్తుంది.

సాధారణ మానవుడు మానసిక శరీరం నుండి భౌతికస్థాయిలోకి ఒక ఆలోచనని పంపించదలచుకుంటే ఆ ఆలోచన మధ్యలో అనేక విభాగాలు పూర్తిగా తెరచుకొని కారణంగా తనదైన విభాగం నుండి దిగిరావాలి (మనం పైన చెప్పుకున్న భౌతిక కామ మానసిక పొరలు కూడిన ద్వారానే మానవుడి ప్రతి ఆలోచన క్రిందికి దిగివచ్చి కార్య కలాపంగా మారాలి). అది క్రిందికి ప్రసరించే మార్గం కనుగొనేలోగా మానసిక మెదడు యొక్క పొరల కూడిన ద్వారా ప్రసరించాలి. దానికి ఏ మాత్రం సరిపోయినది కాకపోయినా ఏదో ఒక సన్నటి వాహిక ద్వారా అది క్రిందికి దిగిరావాలి. అప్పుడు అది భౌతికస్థాయి లోకి దిగివచ్చి భౌతిక మెదడులోని తనకు తగిన కణాల ద్వారా వ్యక్తమౌతుంది.

నిస్సందేహంగా ఈ పద్ధతి చాలా అస్పష్టంగానూ అయోమయంగానూ

వుంది. ఈ కారణంగానే కొంతమందికి గణితశాస్త్రం ఏమాత్రం అర్థంకాదు. మరికొందరు సంగీతాన్ని ఏ కొద్దిగానూ ఆస్వాదించలేరు. ఇది అన్ని విషయాలకు వర్తిస్తుంది. మెదడులో ఒక విషయానికి సంబంధించిన విభాగం తెరుచుకోక పోవడమే దీనికి కారణం.

పరిపూర్ణ మానవుడైన పురుషుడిలో ప్రతి కణానికి దాని స్వీయమైన వాహిక వుంటుంది. దానితో పాటు దానికి మెదడులోని సర్వవిధ భాగాల్తో అను సంధానం వుంటుంది. ఈ కారణంగానే ఒక నిర్దిష్టమైన సముచిత మైన ప్రతి ఆలోచనకి ప్రసరించడానికి వీలైన దానికి తగిన ఒక విభాగం వుంటుంది. దాని ద్వారా అది భౌతికమైన మెదడులోని నిర్దేశిత ప్రాంతానికి చేరుకుంటుంది.

ప్రజాశక్తి యొక్క క్రమాన్ని మొత్తం మీద విశ్లేషిస్తే అనాత్మ నుండి ఆత్మకి ప్రసరించే విధానం కనిపిస్తుంది. ముందుగా వెలుపల నుండి భౌతిక శరీరంపై పడే ముద్రలను పరిశీలించాలి. ఈ ముద్రల్ని కామశరీరం అనుభూతులుగా మారుస్తుంది. వీటిని మానసిక శరీరం భావనలుగా మారుస్తుంది. ఈ స్థితిలో భావనలు అన్నీ విస్తరించి భౌతికశరీరం తత్వాలుగా మారుతాయి. ఇదంతా భవిష్యత్తులోని ఆలోచన ద్రవ్యరాశి ఉచితమైన ఆకృతిని ధరిస్తుంది.

అనాత్మతో ఏర్పడిన ప్రతి సాన్నిహిత్యం మానసిక శరీరంలోని ద్రవ్యరాశిని పునర్వ్యలస్థీకరించి దానిలోని ద్రవ్యరాశిని బాహ్యామైన వస్తువుల యొక్క చిత్రాలుగా రూపాలుగా మారుస్తుంది.

రూపాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ చిత్రాల మధ్య సంబంధ బాంధవ్యాలు ఏర్పడతాయి. దానిలోని జీవం దృష్టిలో పెట్టుకుంటే ఆ వ్యక్తిలోనే దీనికి సంబంధించిన సవరణలు కనిపిస్తాయి. మానసిక శరీరాల మధ్య వున్న సంబంధ బాంధవ్యాలను పరిశీలించి సమన్వయం చేయడమే మానవుడు చేపట్టవలసిన విశేష కార్యం. దీనితోపాటు అతడు ఈ చిత్రాలను ఆలోచనలుగా కూడా మార్చుకోవాలి. మానవుడు ఈ విధంగా క్రమానుగతంగా ఈ చిత్రాలను మళ్ళీ మళ్ళీ ఆలోచనలుగా కాలం అనే విశేష అంశాన్ని కూడా జోడించి సవరిస్తూ వుంటే స్మృతి లేదా జ్ఞాపకం ఊహించడం అనేది సంభవిస్తాయి.

ఆ విధంగా పనిచేస్తున్న ప్రజాశక్తి ఊర్ధ్వస్థాయి ద్వారా ప్రభావితం అవుతుంది. ఆ స్థాయిలోని ఆలోచనలు, రూపాలు భౌతిక స్థాయిలోని రూపాలకి అనుగుణంగా వుండవు. అత్యున్నతమైన ఈ భావాలు విశ్వాత్మ నుండి ప్రజ్ఞాశక్తిపై ప్రసరిస్తాయి.

# స్పేస్-టైమ్ యొక్క స్వరూపం

- స్వామి కృష్ణానంద
(అనువాదం - డా॥ ఈ.వి.కె.శివానంద్)

స్వామీజీ: భగవంతుడు ఉన్నాడు, స్థలం మరియు సమయాన్ని సృష్టించడానికి ముందే ఉనికిలో ఉన్నాడు. స్థలం మరియు సమయానికి ముందు అతను ఉన్నందున, సంబంధం ఉందని మీరు చెప్పలేరు. అతను స్థలం మరియు సమయం లేకుండా ఉనికిలో ఉంటాడు. ఉనికికి స్థలం మరియు సమయం అవసరం లేదు. స్థలం మరియు సమయం అనేది ఒక రకమైన బాహ్యత్వం, ఇది స్వచ్ఛమైన జీవి ద్వారా అంచనా వేయబడుతుంది మరియు దేవునికి బాహ్యత్వం లేదు. ఇది మాకు మాత్రమే.

మీరు ఆధునిక భౌతిక శాస్త్రం మరియు దాని గొప్ప పరిణామాలతో పరిచయం కలిగి ఉంటే, స్థలం మరియు సమయం వంటివి ఏవీ లేవు, నిజంగా మాట్లాడటం. అవి ఉనికిలో లేవు. స్వప్న ప్రపంచంలో ఒక మోసపూరిత స్థలం మరియు సమయం ఉన్నట్లే అదే విధంగా స్పృహ యొక్క తప్పుడు కదలిక ద్వారా సృష్టించబడిన ఒక రకమైన మోసం, దీని ద్వారా కలలు అనుభూతి చెందే స్పృహ బయట విషయాలు ఉన్నాయి కల యొక్క స్థలం-సమయం. ఇది మొత్తం ప్రపంచాన్ని చూడగలదు, కానీ కనిపించే ప్రపంచం మొత్తం స్థలం-సమయం ఉంటేనే అక్కడ ఉంటుంది. స్థలం-సమయం లేకపోతే, ప్రపంచం ఉండకూడదు.

ఇప్పుడు, కలలోని స్థలం-సమయం స్వయంగా ఉనికిలో లేదు. ఇది స్పృహ యొక్క విచిత్రమైన ఉపాయం. వాస్తవానికి లేనిదాన్ని ప్రొజెక్ట్ చేసే ఇంద్రజాలికుడు వలె, స్పృహ తెలివికి అర్థం కాని రీతిలో తనను తాను బాహ్యపరిచింది. చైతన్యాన్ని బాహ్యపరచలేము. ఇది స్వచ్ఛమైన విషయం. అది వస్తువుగా మారదు. అది ఏమిటో కాకుండా మరొకటి ఉండకూడదు. కనుక ఇది స్థలం మరియు సమయం అయిన బాహ్యత్వం రూపంలో ఉన్నట్లుగా, అది తనను తాను ప్రొజెక్ట్ చేసినప్పుడు, ఇది మొత్తం అపోహ ప్రపంచంలో ఉంది. కాబట్టి కలల ప్రపంచం లేదు. మేల్కొనే స్థితిలో ఏమి జరుగుతుందో వివరించడానికి ఇది ఒక సారూప్యత. సంపూర్ణ, ఇది స్వచ్ఛమైన జీవి మరియు చైతన్యం, నిశ్చితార్థం అయినట్లు

కనిపిస్తుంది – మనం ఇక్కడ చాలా జాగ్రత్తగా పదాలను ఉపయోగించాలి; ఇది దేనిలోనూ నిమగ్నమై లేదు, అది నిమగ్నమై ఉన్నట్లు కనిపిస్తుంది – తనను తాను బాహ్యపరిచే చర్యలో మరియు స్థలం మరియు సమయం బాహ్యీకరణ శక్తికి ఒక పేరు మాత్రమే. స్థలం మరియు సమయం అనేది చైతన్యం అంటే అది కాకుండా వేరేదిగా ఉండటానికి బలవంతం చేస్తుంది. ఇది మొత్తం భ్రమ, అందుచేత ప్రపంచం కూడా ఒక భ్రమ అని, చివరికి కలలో పాలుపంచుకున్న వారందరికీ ఇది చెల్లుతుంది. మీరు కలల విషయం, కలల ప్రపంచం అవాస్తవమని చెప్పలేరు ఎందుకంటే మీరు కల ప్రపంచ నిర్మాణంలో భాగం, విషయం మరియు వస్తువు కలలో సమాంతర స్థాయిలో ఉన్నాయి. కలలో, బయటి ప్రపంచం కలను చూసేవారిలా వాస్తవమైనది. విషయం మరియు వస్తువు, చూసేవాడు మరియు చూసినవారు సమాంతర రేఖలో ఉన్నారు. అందువల్ల, మీరే ఈ బాహ్యీకరణలో పాలుపంచుకున్నప్పుడు, ప్రపంచం వాస్తవమైనదిగా కనిపిస్తుంది. ఇది పరమాత్మకు వర్తించదు ఎందుకంటే పరమాత్మ కూడా తనను తాను బాహ్యంగా మారుస్తుంటే, అది నిలిచిపోతుంది; అది అవుతుంది. అవ్వడం అనేది పరివర్తన మరియు ప్రవాహ ప్రక్రియ – ఇది ఏమిటో కాకుండా మరొకటి అవుతుంది. భగవంతుడు అతను కాకుండా వేరేవాడు కాడు.

కాబట్టి గ్రహణ ప్రపంచం మొత్తం ఒక రకమైన ఫాంటస్మాగోరియా, ప్రపంచ చైతన్యం చేత సృష్టించబడినది, ఇది సాపేక్షత మరియు క్వాంటం మెకానిక్స్ సిద్ధాంతంలో ఆధునిక భౌతిక శాస్త్రంలో చాలా లోతుగా అధ్యయనం చేయబడింది. మీరు చదివితే, మీరు డ్రీమ్ ల్యాండ్ లో ఉన్నారని మీరు కనుగొంటారు, మరియు మీరు డ్రీమ్ ల్యాండ్ లో ఉన్నారని మీకు తెలియదు ఎందుకంటే మీరు మీరే ఆ భూమిలో పాలుపంచుకున్నారు. కోర్టులో న్యాయమూర్తి స్వయంగా క్లయింట్ అయితే, అతను ఏ తీర్పు ఇవ్వగలడు? అదేవిధంగా, మేము ఈ ప్రపంచానికి న్యాయనిర్ణేతలు, కానీ మేము కూడా ఈ ప్రపంచంలోని నిర్మాణంలో పాలుపంచుకున్నాము. అందువల్ల, మీరు మీ మానవ స్వభావాన్ని మించి, మీ చైతన్యాన్ని విశ్వవ్యాప్త స్థాయికి విస్తరిస్తే తప్ప ఈ ప్రపంచం ఏమిటో ఏ మానవుడు అర్థం చేసుకోలేడు, అందులో మీరు ఎప్పటికీ బాహ్యతను చూడలేరు. విశిష్టత

మరియు బాహ్యాత్వం విశ్వవ్యాప్తతకు వ్యతిరేకం. మీ స్పృహ ఈ ప్రత్యేకమైన అవగాహన మరియు బాహ్య పరిశీలన కంటే పైకి ఎదగగలిగితే, మరియు అన్నింటినీ కలుపుకొని పోవడాన్ని అనుభవిస్తే, ప్రశ్న కూడా తలెత్తదు.

భారతదేశంలో మనకు యోగ వసిష్ఠ అనే గొప్ప గ్రంథం ఉంది. ఐన్‌స్టీన్ మరియు మాక్స్‌ప్లాంక్ ఈ రోజు చెప్పిన విషయాన్ని ఇది చెబుతుంది. ఐన్‌స్టీన్ మరియు మాక్స్ ప్లాంక్ పుట్టకముందే, యోగా వశిష్ఠ ఈ విషయాలన్నీ చెప్పాడు **స్థలం మరియు సమయం యొక్క సాపేక్షత మరియు అక్కడ బాహ్య ప్రపంచం ఉండడం అసాధ్యం**.

మేధస్సు మీ వ్యక్తిత్వంలో ఒక భాగం, మరియు వ్యక్తిత్వం ఈ బాహ్య నిర్మాణంలో పాల్గొంటుంది కాబట్టి మేధోపరంగా దాన్ని గ్రహించడం సాధ్యం కాదు. అందువల్ల, యోగా మరియు ధ్యానం యొక్క శక్తి ద్వారా, మీరు ఏదో ఒక విధంగా లేదా మరొకటి స్పృహ యొక్క బాహ్య ఒత్తిడి నుండి మిమ్మల్ని మీరు విడదీసి, దానిని తిరిగి యూనివర్సల్ కు తీసుకువస్తే తప్ప ఎవరూ ఏమీ అర్థం చేసుకోలేరు.

యోగా అనేది ఆధ్యాత్మిక వ్యాయామం యొక్క గొప్ప ఘనత, దాని గురించి నేను మీతో పెద్దగా మాట్లాడలేను. ఇది ఒక వింత విషయం.

**ఒక సందర్శకుడు :** స్వామీజీ, సమయం కూడా అపరిమితమైనది.

**స్వామీజీ :** మీరు ఇప్పుడు ఎందుకు సమయం తీసుకువస్తున్నారు? గందరగోళ అవగాహనలో పాల్గొనడం తప్ప ఇది ఉనికిలో లేదని నేను మీకు చెప్పాను. ఇది ఒక గ్రహణ లోపం, ఇది చూసే ప్రతి ఒక్కరికీ సోకుతుంది. ఇది ఒక సాధారణ లోపం, ఇది ప్రతి వ్యక్తికి, ప్రతి ఒక్కరికి, ఒక క్రిమికి కూడా చొప్పించబడుతుంది, ఇది ప్రపంచాన్ని బయట చూస్తుంది. దీనిని సంసారం, మొత్తం చిక్కు అని పిలుస్తారు, మరియు వ్యక్తి దాని లోపల ఇప్పటికే ఉన్నందున చిక్కు ఉందని తెలుసుకోలేరు.

మీరు తక్కువ మాట్లాడితే మంచిది. తక్కువ మంచిది అన్నారు. మీరు ఎక్కువగా మాట్లాడకూడదు. ఏదేమైనా, ఈ విషయం యొక్క ప్రాముఖ్యత మీకు తెలుసు. ఇది చాలా తీవ్రమైనది. ఇది లోతుగా, నిష్పాక్షికంగా, మరియు లోతైన విశ్రాంతి సమయంలో ఎల్లప్పుడూ పరిగణనలోకి తీసుకోవడం విలువైనది.

# మన భవితకు మనమే నిర్మాతలం

– రాజయోగి రాజవీర్, హన్మకొండ
సెల్ : 8978691285

ఆత్మ నిర్భరత మనకు ఉండాలి. అప్పుడె మన సాహసమైన సంకల్పశక్తి స్వశక్తిగా మారి నమ్మకంతో మనం సమగ్రమైన స్వయం సమృద్ధిని సాధించుకో గలం. ఆత్మశ్రద్ధ స్వయంశక్తిని అందిస్తుంది. ముక్కోటి దేవతలపై మనకు యున్న భక్తి శ్రద్ధకన్నా మించిన శ్రద్ధా భక్తి, ఆకలితో బాధపడుచున్న వారికి పని కల్పించడంలో వుంటుందని సంత్ కబీర్ అన్నారు. స్వయంశక్తి మీద నమ్మకం కల్పించండి! ఆత్మ నిర్భరతగా వ్యవహరించే దివ్య శక్తి మనలో దాగి యున్నది. మన భవితకు మనమే నిర్మాతలం కాగలమని ఈ నాటి యువతరానికి ఆత్మశక్తి గురించి మనం తెలియజేయాలి. మనలో నిద్రాణమై ఉండే దివ్యమైన ఆత్మశక్తికి శ్రద్ధతో ప్రేరణ కల్గించవలసిన బాధ్యత మనందరిపై యున్నది. ఆత్మ విశ్వాసంతో అడుగులు ముందుకు వేయించగల ప్రేరణ అనేది ఆత్మ నిర్భరత. ఇది దివ్యమైన ఔషదం. మన కంటికి కనిపించని కరోనాల వంటి మహమ్మారులనైనా ఎదుర్కొగల శక్తి, విశ్వాసం మనలో ఉన్నంత కాలం మనకు అన్ని అద్భుతాలు విజయవంతంగా కనిపిస్తాయి.

మనలోని శక్తి సామర్థ్యాలు పెరగాలంటే, మనం ఆరోగ్యంగా వుండాలంటే, జీవిత అధ్యయనం చేయాలి. శ్వాస తీసుకున్నట్లుగా తుది క్షణం వరకు సంకల్ప బలంతో నిరంతరముగా సాహసంతో అన్వేషిస్తూనే ఉండాలి. ప్రతి సమస్య గ్రహించేదంతా మనకు జీవిత అనుభవం అవుతుంది. ఇది మన పరిపక్వతను పెంచుతుంది. జీవితంలో లెక్కకు మించిన అవకాశాలు వస్తాయి. పట్టుదల ఉంటే జీవితాన్ని మెరుగుపరుచు కుంటూ ముందుకు సాగాలి, మనలోని అభివృద్ధి వెలుగును మనం చూడాలి. మనసు విచిత్రమైనది ఒకే ఆలోచన మీద నిలకడగా ఉండదు. కోరికలు నిండిన దైవభక్తిని వదిలేసి నిష్కామ సేవలో జీవించగలగడం ఒక గొప్ప తపస్సు. పంచభూతాత్మకమైన మన శరీరంలో యున్న మనస్సు ఇంత వరకు ఒక విచిత్రమైన సత్యాన్ని తెలుసుకో లేదు. "ఏదీ మనది కాదు. మనతో ఏదీ రాదు". ఈ సత్యం అర్థమైన రోజున మనస్సు శక్తివంతముగా మారుతుంది. నిష్కామ సేవకు మించిన పూజ మరొకటి లేదని

తెలుస్తుంది. మన జీవితం సార్థకమయ్యేలా ఆశలు, ఆశయాలతో జీవనం సాగిస్తూ, తెలుసుకున్న జ్ఞానాన్ని ఇతరులకు సేవా మార్గంతో అందిస్తూ చక్కని మార్గంలో అడుగులు వేయాలని మన మనస్సుకు జ్ఞానోదయం కలుగుతుంది.

లక్ష్య శుద్ధి ఉంటేనే లక్ష్య సిద్ధి కలుగుతుంది, లక్ష్మి సిద్ధిస్తుంది అన్నింటికి మూలం లక్ష్య సిద్ధి. విద్యా బోధన కేవలం పాఠ్యాంశాలకు పరిమితం కావద్దు. విద్యా సర్వ శక్తిని అందించి, సమాజ చింతన చేసే శక్తిని మరియు నైతిక విలువలను అందించే జ్ఞాన ప్రతిభ కావాలి. మనలో దాగియున్న ప్రతిభను మనం గుర్తించాలి. లక్ష్య నిర్దేశానికి, లక్ష్య సాధనకు మానవులు గురువుల ద్వారా మార్గదర్శనం పొందాలి. లక్ష్య సాధనకు సత్ప్రవర్తన, ఇంద్రియ నిగ్రహం, ఏకాగ్రత, ఉద్రిక్తతా రాహిత్యం ఈ నాలుగు సూత్రాలను అర్థం చేసుకోవాలి. విజాయాన్ని వినయంతో స్వీకరించాలి మరియు పరాజయాన్ని గుణపాఠంగా భావించిన రోజున మనకు జీవిత ఆశయాలు అర్థం కాగలవు. శక్తి అంతా మనలోనే ఉంది! దీనిని విశ్వసించండి! బలహీనులమని భావించకండి! లేచి నిలబడి మనలో అంతర్లీనంగా ఉన్న శక్తిని ప్రకటించండి! మీరు అనంతశక్తి సంపన్నులు లేవండి! మేల్కొనండి! మీలో ఉన్న దివ్యత్వాన్ని వ్యక్తీకరించండని, స్వామి వివేకానందుడు జ్ఞాన సంపద మనకు బోధించిన విషయాన్ని మనం అర్థం చేసుకొని, దివ్యమైన

**జ్ఞాన సంపద శక్తిని ప్రదర్శిస్తాం రండి!**

## శ్రద్ధాంజలి

విజయనగరం వశిష్ఠా దివ్యజ్ఞాన సమాజ సభ్యులు అయిన సో॥ రామసింగు బుచ్చెన్నగారు (డి.నెం. 82472) 20-7-2020న సో॥ శ్రీద్వారకా భమిడిపాటి గోపాలకృష్ణగారు (డి.నెం. 85603) 30-9-2020 న పరమపదించారు. వారికి ఉత్తమగతులు కలగవలెనని సమాజ సభ్యులు 2 ని॥ మౌనం వహించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు.

వీరిరువురి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ దీపిక శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

# వార్తలు - విశేషాలు

**గుంటూరు :**

శ్రీకృష్ణదివ్యజ్ఞాన సమాజం, గుంటూరువారు ది.17 నవంబరు, 2020 నుండి 23 నవంబరు, 2020 వరకు సౌభ్రాత్ర వారోత్సవాలు అంతర్జాలము ద్వారా నిర్వహించారు.



17వ తేదీన శ్రీ పి.ఎల్.ఎల్.ప్రసాదుగారు
"దివ్యజ్ఞాన సమాజ స్థాపన - ఆధ్యాత్మికాభివృద్ధి" పై



18వ తేదీన శ్రీ యస్.శ్రీనివాసమూర్తిగారు
"దివ్యజ్ఞాన సమాజ ఆవిర్భావం" పై



19వ తేదీన శ్రీ కె.వి.ఎల్.కాంతారావుగారు
"దివ్యజ్ఞాన సమాజ స్థాపకులు
ప్రియమైన, హృదయాన్ని కదిలించే కొన్ని జ్ఞాపకాలు" పై



20వ తేదీన శ్రీ యస్.శ్రీనివాస శ్రీహర్షగారు
- "బ్లావెట్స్కి - ఆల్కాట్" పై



21వ తేదీన శ్రీ యం.నారాయణరావుగారు
"వసుదైక కుటుంబకం" పై



22వ తేదీన శ్రీమతి టి.ఉమామహేశ్వరి
"సువర్ణసోపానాలు" పై



23వ తేదీన శ్రీ యన్.శ్రీనివాసకృష్ణ
"అణువులు, పరమాణువులు - దివ్యజ్ఞానం"

అనే అంశంపై ప్రసంగములు చేసారు. ఈ కార్యక్రమాలను సుమారు 50 మంది దివ్యజ్ఞాన సమాజముల సభ్యులు మరియు ఇతరులు వీక్షించినారని సమాజ కార్యదర్శి తెలియజేసారు.

**వరంగల్ :**

Theosophical Society, Satya Vichara Center Hanamakonda – Warangal కేంద్రంలో ఈ రోజు 17-11-2020న శ్రీ కె.నాగేశ్వరరావుగారి అధ్యక్షతన సర్వమత సామరస్యతత్వము గురించి చర్చలు జరిగినవి.

రష్యా దేశస్తురాలు హెచ్.పి.బ్లావట్స్కీ మరియు హెచ్.ఎస్.ఆల్కాట్ న్యూయార్క్‌లో 17-11-1875న (Theosophical Society) "దివ్యజ్ఞాన సమాజం"ను స్థాపించి వాటి కేంద్రాలను ప్రపంచమంతటా స్థాపించి సర్వమత సామరస్యతత్వము గురించి ప్రచారం చేసిన విషయాలను శ్రీ కె.నాగేశ్వర్‌రావుగారు వివరించారు. ఈ సర్వమత సమ్మేళనం కార్యక్రమములో సంత్ కబీర్ వాణి సంస్థాపకులు శ్రీ రాజయోగి రాజవీర్, శ్రీ శిర్డిసాయిబాబామందిర్ అధ్యక్షులు శ్రీ హరిగోపాల్‌గారు మరియు క్రైస్తవ మత ప్రచారకులు శ్రీ రవిగారు పాల్గొన్నారు. జాతి, మత, లింగ, కుల, వర్ణ వివక్షతలేని విశ్వమానవ కల్యాణం గురించి వివరించినారు. డా॥ ఆనిబెసెంట్ గారు తెల్పిన విశ్వమానవ సేవల గురించి వివరిస్తు, There is no Religion Higher than truth అను విశ్వసత్యాన్ని అందరు తెల్సుకున్నారు. సర్వమత సామరస్య తత్వమును ప్రోత్సహించాలని, మానవ శక్తుల గురించి మరియు ప్రకృతి ధర్మముల గురించి పరిశోధన చేయాలని తెల్పడం జరిగినది. ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి శ్రీ కాసం కిరణ్ అభివందనములు తెలియజేశారు.

